ఎన్‌ఎండీసీ సీఎండీగా అమితవ ముఖర్జీ

హైదరాబాద్, మార్చి 6: ప్రభుత్వరంగ ఖనిజ దిగ్గజం ఎన్‌ఎండీసీ నూతన చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా అమితవ ముఖర్జీ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కంపెనీ సీఎండీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయననే పూర్తి స్థాయి సీఎండీగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన గురువారం పదవిబాధ్యతలు స్వీకరించారు. ఆయన ఈ పదవిలో ఫిబ్రవరి 29, 2028 వరకు కొనసాగనున్నారు. నవంబర్ 2018 నుంచి ఎన్‌ఎండీసీ డైరెక్టర్(ఫైనాన్స్)గా బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖర్జీకి మార్చి 2023లో సీఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది కేంద్రం.

74 వేల పైకి సెన్సెక్స్

ముంబై, మార్చి 6: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజు కదంతొక్కాయి. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు దిగిరావడంతో దేశీయ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది. తీవ్ర ఊగిసలాటల మధ్య ప్రారంభమైన సూచీలకు గ్లోబల్ మార్కెట్లు ఇచ్చిన దన్నుతో మళ్లీ సెన్సెక్స్ 74 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 609.86 పాయింట్లు లాభపడి 74,340.08 వద్ద ముగియగా..మరో సూచీ నిఫ్టీ 207.40 పాయింట్లు ఎగబాకి 22,544.70 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరుల సంపద రూ.4 లక్షల కోట్లకు పైగా పెరిగింది. స్టాక్ మార్కెట్లో లిస్టైన కంపెనీల విలువ రూ.4,53,808.84 కోట్లు పెరిగి రూ.3,97,57,850.59 కోట్ల(4.57 ట్రిలియన్ డాలర్లు)గా నమోదైంది. మార్కెట్లో ఏషియన్ పెయింట్స్, ఎన్‌టీపీసీ, రిలయన్స్, టాటాస్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌యూఎల్, సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, టైటాన్, బజాజ్ ఫైనాన్స్‌లు అత్యధికంగా లాభపడ్డాయి. కానీ, టెక్ మహీంద్రా, కొటక్ మహీంద్రా బ్యాంక్, జొమాటో, టాటా మోటర్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. క్రూడాయిల్ ధరలు దిగిరావడం, చైనా మరోసారి ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించే అవకాశాలుండటంతో సూచీల్లో జోష్ పెంచాయని జియోజిట్ ఫైనాన్షియల్ అధినేత వినోద్ నాయర్ తెలిపారు. రంగాలవారీగా చూస్తే ఎనర్జీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీస్, యుటిలిటీ, సర్వీసెస్, పవర్, హెల్త్‌కేర్, ఎఫ్‌ఎంసీజీ, ఇండస్ట్రియల్ రంగ షేర్లు లాభాల్లో ముగియగా..టెలికం, రియల్టీ రంగ షేర్లు నష్టపోయాయి.

ఔషధానికి ట్రంప్ సుస్తీ

భారతీయ ఫార్మాకు అమెరికా టారిఫ్ భయాలు

పరిశ్రమపై రూ.లక్ష కోట్లదాకా ప్రభావం

న్యూఢిల్లీ, మార్చి 6: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి కాలుదువ్వుతుండటం.. ఇప్పుడు భారత్‌సహా అన్ని దేశాల్లో గుబులు పుట్టిస్తున్నది. ముఖ్యంగా అమెరికా మార్కెట్‌పై ఆధారపడ్డ భారతీయ ఔషధ పరిశ్రమకు పెద్ద దెబ్బేనన్న అభిప్రాయాలు రోజురోజుకూ పెరుగుతుండటం గమనార్హం. సుంకాలు పెంచితే లక్ష కోట్ల రూపాయలపైనే దేశీయ ఫార్మా ఇండస్ట్రీ ప్రభావితం కావచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయిప్పుడు. తొలి దశలో 25 శాతం చొప్పున భారతీయ ఫార్మా దిగుమతులపై ట్రంప్ సర్కారు సుంకాలు వేయవచ్చని తెలుస్తున్నది. క్రమేణా దీన్ని పెంచుతూపోయే వీలున్నట్టు సమాచారం.

మేకిన్ అమెరికా..

అమెరికాలో మళ్లీ తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి, అక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడానికి దేశంలోకి వస్తున్న విదేశీ వస్తువులపై దిగుమతి సుంకాలను పెంచడమే మార్గమని ట్రంప్ భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆటో, సెమీ కండక్టర్స్‌తోపాటు ఫార్మా దిగుమతులపైనా హై టారిఫ్‌లను పరిశీలిస్తున్నట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తున్నది. అమెరికాలో తయారు చేయండి.. లేకపోతే అధిక టారిఫ్‌లను ఎదుర్కోవాల్సి వస్తుందని ఇప్పటికే ఆయా కంపెనీలకు ట్రంప్ సర్కారు తేల్చిచెప్పినట్టు కూడా తెలియవస్తున్నది. ఇక ప్రస్తుతం భారత్ నుంచి దిగుమతి అవుతున్న ఫార్మా ఉత్పత్తులపై అమెరికా ఎలాంటి సుంకాలు వేయడం లేదు. కానీ అమెరికా నుంచి దిగుమతి అవుతున్న ఔషధాలపై భారత్ 10 శాతం సుంకాలను వేస్తున్నది. ఇది కూడా ట్రంప్ ఆగ్రహానికి దారితీస్తున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మన ఫార్మాతో లాభమే..

అమెరికాకు భారతీయ ఫార్మా దిగుమతులతో లాభమే ఎక్కువగా జరుగుతున్నది. అగ్రరాజ్య ఆరోగ్య సంరక్షణ రంగాన్ని 2022లో దాదాపు 408 బిలియన్ డాలర్ల మేర చౌక జనరిక్ ఔషధాలు ఆదుకున్నాయి. ఇవన్నీ భారత్, చైనా నుంచి వస్తున్నవే. దీంతో ఇప్పుడు వీటిపై సుంకాలు వేస్తే అమెరికా ప్రజలపైనే భారం మోపినట్టు అవుతుందన్న వాదనలూ తెరపైకి వస్తున్నాయి. దీంతో ఇప్పటికైతే ఫార్మా ఇండస్ట్రీకి సుంకాల నుంచి మినహాయింపు దక్కే అవకాశాలూ లేకపోలేదని అంటున్నారు. ప్రధానంగా భారతీయ ఔషధ కంపెనీలు తక్కువ లాభాలకే అమెరికా మార్కెట్‌లో తమ మందులను విక్రయిస్తున్నాయని మార్కెట్ నిపుణులూ గుర్తుచేస్తున్నారు.

ఏటా రూ.లక్షల కోట్లలో నష్టం?

ట్రంప్ హెచ్చరిస్తున్నట్టుగా ఏప్రిల్ 2 నుంచి అమెరికాకు ఎగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై అధిక సుంకాలు విధిస్తే.. ఏటా లక్షల కోట్ల రూపాయల్లో నష్టం వాటిల్లుతుందని అంచనా. రసాయనాలు, లోహ వస్తువులు, నగలు, ఆటోమొబైల్స్, ఔషధాలు, వ్యవసాయం-ఆహారోత్పత్తి రంగాల కంపెనీలకు ఈ సుంకాల సెగ అధికంగా తగలనున్నది. అమెరికాకు భారత్ నుంచి వ్యవసాయ ఉత్పత్తులు పెద్ద ఎత్తున ఎగుమతి అవుతున్నాయి. 2021-22లో 5.7 బిలియన్ డాలర్ల మేర జరిగాయి. ఈ క్రమంలో భారతీయ అగ్రీ ఎక్స్‌పోర్ట్స్‌పై 100 శాతం సుంకాలకు వీలున్నట్టు చెప్తున్నారు. స్మార్ట్‌ఫోన్ ఎగుమతులకూ ఇబ్బందేనంటున్నారు. ఈ ఏడాదికి ఐఫోన్ల ఎగుమతి భారత్ నుంచి అమెరికాకు 8 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని అంచనా. దీంతో వీటిపై ట్రంప్ సుంకాల ప్రభావం పడనున్నది. అలాగే ఆభరణాలు, విలువైన రత్నాల ఎగుమతులు 7.6 బిలియన్ డాలర్ల దాకా, యంత్ర పరికరాల ఎగుమతులు 6.1 బిలియన్ డాలర్ల వరకు ప్రభావితం కావచ్చని వినిపిస్తున్నది. 2023-24లో అమెరికాకు భారతీయ ఎగుమతులు 77.51 బిలియన్ డాలర్లుగా.. అమెరికా నుంచి దిగుమతులు 42.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

ఇదీ సంగతి..

గత ఏడాది అమెరికాకు భారత వ్యాపార ఎగుమతులు సుమారు 74 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ముత్యాలు, రత్నాలు, ఆభరణాల వాటానే 8.5 బిలియన్ డాలర్లు. ఔషధాల వాటా మరో 8 బిలియన్ డాలర్లుండగా, పెట్రోకెమికల్స్ ఎగుమతులు దాదాపు 4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక 2023లో అమెరికా నుంచి భారత్‌కు దిగుమతైన వస్తూత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం సగటున సుమారు 11 శాతం సుంకాలను వేసింది. భారత్ నుంచి అమెరికాకు దిగుమతైన వాటిపై అక్కడి ప్రభుత్వం వేసిన సుంకాలతో పోల్చితే ఇది దాదాపు 8.2 శాతం అధికం. మోటర్‌సైకిళ్లు, యాపిల్స్, క్రాన్‌బెర్రీస్, బాదాం, చికిపీస్, వ్యాధి నిర్ధారణ వైద్య పరికరాల వంటి భారత్‌కు వస్తున్న కొన్ని ప్రధాన అమెరికా ఉత్పత్తులపై రెండంకెల స్థాయిలో దిగుమతి సుంకాలను మోదీ సర్కారు మోపుతున్నది. నిజానికి అంతకు ముందు ఇంకా ఎక్కువే ఉండేవి. బడ్జెట్‌లో తగ్గించినప్పటికీ మోటర్‌సైకిళ్లపై 30 శాతం, బాదాంపై 42-120 శాతం, యాపిల్స్‌పై 50 శాతం, డయాగ్నోస్టిక్ పరికరాలపై 35 శాతం సుంకాలు వర్తిస్తున్నాయి. అయితే ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్ దేశాల నుంచి వస్తున్న దిగుమతుల కంటే అమెరికా నుంచి వస్తున్న దిగుమతులపైనే సుంకాలు ఎక్కువగా ఉంటున్నాయి. మినరల్స్‌పై సగటున 9.2 శాతం, పాదరక్షలపై 26.1 శాతం, టెక్స్‌టైల్స్‌పై 24.8 శాతం సుంకాలు పడుతున్నాయి. ఈ తీరే ఇప్పుడు ట్రంప్ ఆగ్రహానికి కారణమవుతున్నది. ఈ క్రమంలోనే తమపై ఎంత సుంకం వేస్తే.. అంతే సుంకం తిరిగి వేస్తామని తెగేసి చెప్తున్నారు. వచ్చే నెల 2 నుంచి టారిఫ్‌లుంటాయని ప్రకటించారు. ఫలితంగా భారత్‌పై ఇప్పుడు ఒత్తిడి పెరుగుతున్నది. వీలున్నంత వరకు ఆయా అమెరికా వస్తూత్పత్తులపై దిగుమతి సుంకాలకు కోత పెట్టింది. మరి కొన్నింటిని సమీక్షిస్తున్నది.

అమెరికా టారిఫ్‌ల పెంపు భారతీయ జనరిక్ ఔషధాల తయారీ సంస్థలను పెద్ద ఎత్తున ప్రభావితం చేయగలదు. అయితే అమెరికా అవసరాల దృష్ట్యా ఫార్మాస్యూటికల్స్, జనరిక్ డ్రగ్స్‌పై ఈ సుంకాల నుంచి మినహాయింపు లభించగలదని ఆశిస్తున్నాను. అలాకాకపోతే అమెరికాలో తయారీపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

-వినితా గుప్తా, లుపిన్ ఫార్మా సీఈవో

అమెరికా టారిఫ్‌లను పెంచితే భారతీయ ఎగుమతులకు తప్పక విఘాతం కలుగుతుంది. అందుకే ఏప్రిల్‌లోగా అమెరికా సర్కారును భారత ప్రభుత్వం మెప్పించగలగాలి. అప్పుడే సుంకాల పెంపు ప్రభావం నుంచి బయటపడగలం. ఇక సుంకాల పెంపు ఎంత? అనేది ప్రస్తుతం అమెరికా వస్తూత్పత్తులపై భారత్ విధిస్తున్నదానిపైనే ఆధారపడి ఉంటుంది.

-అజయ్ శ్రీవాత్సవ, జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు

- ✓ ప్రపంచవ్యాప్తంగా జనరిక్ ఔషధాల సరఫరాలో భారతే అగ్రగామి. ఎగుమతులపరంగా మూడో స్థానం. మొత్తం అవసరాల్లో దాదాపు 20 శాతం భారత్ నుంచే తీరుతున్నది. సుమారు 200 దేశాలకు భారతీయ ఔషధ ఎగుమతులు జరుగుతున్నాయి.
- ✓ అమెరికా ప్రజలకు సరసమైన ధరలకే నాణ్యమైన ఔషధాలు అందడంలో భారతీయ ఫార్మా కంపెనీలది కీలక పాత్ర. అమెరికాలో లభించే జనరిక్ ఔషధాల్లో దాదాపు 70 శాతం దిగుమతి అయినవే. ఇందులో సుమారు 50 శాతం భారత్ నుంచి వచ్చినవే.
- ✓ సిప్లా, లుపిన్, సన్ ఫార్మా వంటి సంస్థలతో పోల్చితే జనరిక్ ఔషధాలను భారీగా ఉత్పత్తి చేస్తున్న జైడస్, అరబిందో, డాక్టర్ రెడ్డీస్ తదితర కంపెనీలపైనే అమెరికా టారిఫ్ పెంపు ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న అంచనాలున్నాయి.
- ✓ అమెరికాకు భారత్ నుంచి 9 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు ఎగుమతి అవుతున్నాయి. భారత్ చేసుకుంటున్న దిగుమతులతో పోల్చితే ఇది 10 రెట్లు అధికం.
- ✓ ట్రంప్ సర్కారు టారిఫ్‌లను పెంచడం ఖాయమని ఫార్మా కంపెనీలు భావిస్తే.. అమెరికా మార్కెట్ నుంచి ఐరోపా, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్ల వైపునకు వెళ్లడమే ఉత్తమమని ఔషధ రంగ నిపుణులు చెప్తున్నారు.
- ✓ అమెరికా ఆరోగ్య సంరక్షణ రంగం వ్యయభారాన్ని 2022లో 219 బిలియన్ డాలర్లు తగ్గించిన భారతీయ ఫార్మా ఇండస్ట్రీ. 2022-23లో అమెరికాలోని హైపర్‌టెన్షన్ రోగుల చికిత్సకు వాడిన జనరిక్ ఔషధాల్లో 60 శాతం భారత్‌వే. దీని వల్ల అక్కడ 25.3 బిలియన్ డాలర్లు ఆదా అయ్యింది.

సెమీకండక్టర్ల యూనిట్‌ను నెలకొల్పండి

- ఎన్‌ఎక్స్‌పీ ప్రతినిధులతో శ్రీధర్ బాబు

హైదరాబాద్, మార్చి 6(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సెమీకండక్టర్ల యూనిట్‌ను నెలకొల్పాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఎన్‌ఎక్స్‌పీ సెమీకండక్టర్స్ కంపెనీ ప్రతినిధులను కోరారు. గురువారం కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి.. రాష్ట్రంలో సెమీకండక్టర్ల యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి ఉన్న అనుకూలతలను వివరించారు. 2030 నాటికి భారత్‌లో సెమీకండక్టర్ల తయారీ మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్నారు.

ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం...

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహిస్తూ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో లెన్స్‌కార్ట్ తయారీ యూనిట్ శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు దక్కేలా చొరవ తీసుకుంటున్నామన్నారు.

హైదరాబాద్‌లో అవంతి యూనిట్

హైదరాబాద్, మార్చి 6: పెంపుడు జంతువుల ఆహార పదార్థాల తయారీ సంస్థ అవంతి గ్రూపు..తాజాగా పిల్లి ఆహార పదార్థాలను సైతం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా అవంతి గ్రూపు సీఎండీ ఇంద్ర కుమార్ అల్లూరి మాట్లాడుతూ..పెంపుడు జంతువులకు నాణ్యమైన ఆహారపదార్థాలను అందించడానికి సంస్థ ఎల్లప్పుడూ కృషి చేస్తున్నదని, దీంట్లోభాగంగా హైదరాబాద్‌లో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. మరోవైపు, అవంతి ఫీడ్స్‌లో ఐఐఎఫ్‌ఎల్ క్యాపిటల్ సర్వీసెస్ తన వాటాను మరింత పెంచుకున్నది. 59.55 లక్షల షేర్లు లేదా 4.4 శాతం వాటాను గురువారం కొనుగోలు చేసింది. ఒక్కో షేరుకు రూ.786 చొప్పున రూ.469.82 కోట్లతో ఈ వాటాను పెంచుకున్నది.

నేడు ఎంఎస్‌ఎంఈ సదస్సు

హైదరాబాద్, మార్చి 6(నమస్తే తెలంగాణ): ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని తాజ్‌దక్కన్‌లో ఎంఎస్‌ఎంఈ స్పార్క్-2.ఓ పేరుతో 'ఫ్రం లోకల్ రూట్స్ టూ గ్లోబల్ హైట్స్' అనే అంశంపై సదస్సు జరగనుంది.

పారాదీప్ ఫిషింగ్ హార్బర్‌లో భారీ అగ్ని ప్రమాదం

- దగ్ధమైన 12 పడవలు

భువనేశ్వర్, మార్చి 6: ఒడిశాలోని పారాదీప్ ఫిషింగ్ హార్బర్‌లో గురువారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో ఓడరేవులో నెహ్రూ బంగ్లా వద్ద పెద్ద ఎత్తున మంటలు చెలరేగి..12 పడవలు దగ్ధమయ్యాయి. ఓడలకు సమీపంలో పార్కింగ్ చేసిన ఓ ట్రక్ సహా, పలు వాహనాలకు కూడా మంటలు అంటుకొని ధ్వంసమయ్యాయని, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లిందని జిల్లా అధికారులు తెలిపారు. గురువారం రాత్రికి మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చినట్టు పారాదీప్ ఏడీఎం నిరంజన్ బెహరా చెప్పారు. ఫిషింగ్ బోట్లలోని పేలుడు స్వభావం గల డీజిల్, వంటగ్యాస్ సిలిండర్లు ప్రమాద ఘటనకు కారణమని అధికారులు భావిస్తున్నారు. మంటలు చెలరేగిన సమయంలో హార్బర్‌లో నెహ్రూ బంగ్లా వద్ద 400 వరకు చిన్న పడవలు, 50 పెద్ద పడవలు ఉన్నాయని తెలిసింది.

అడిగిన భరణం కన్నా ఎక్కువ మంజూరు చేయొచ్చు

- ఒరిస్సా హైకోర్టు

భువనేశ్వర్: భార్య కోరిన భరణం కన్నా ఎక్కువ సొమ్మును మంజూరు చేసే అధికారం కోర్టుకు ఉందని ఒరిస్సా హైకోర్టు చెప్పింది. న్యాయమైన పోషణ భత్యాన్ని అందించడం కోసం న్యాయపరమైన విచక్షణాధికారాన్ని వినియోగించాలని తెలిపింది. ఆధారపడిన వ్యక్తి వాస్తవ అవసరాలు, చెల్లించే వ్యక్తి (భర్త) ఆర్థిక సామర్థ్యం వంటి వాటిని పరిశీలించి, నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. భార్య ప్రారంభంలో తక్కువ సొమ్మును కోరినప్పటికీ, అంతకన్నా ఎక్కువ పోషణ భత్యాన్ని ఆమెకు కోర్టు మంజూరు చేయవచ్చునని వివరించింది.

గృహ హింస బాధితులకు ఇకపై 10 రోజుల ఆశ్రయం

న్యూఢిల్లీ, మార్చి 6: గృహ హింస బాధితులకు ప్రభుత్వానికి చెందిన వన్ స్టాప్ సెంటర్ (ఓఎస్‌సీ)లలో ఇక నుంచి ఐదు రోజులకు బదులుగా 10 రోజుల వరకు ఆశ్రయం కల్పించాలని యోచిస్తున్నట్టు కేంద్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి అనుపమ దేవి తెలిపారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో బాధితులు 15 రోజుల వరకు అందులో నివసించవచ్చునని తెలిపారు. అయితే చిరకాలం ఆ సెంటర్లలో నివసించాలని కోరుకునే వారికి స్వధార్ గృహ్ ద్వారా ఓఎస్‌సీలలో తగిన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. గృహ హింస బాధితులైన మహిళలు వారి పిల్లలతో (ఆడపిల్లలైతే ఏ వయసు వారైనా, మగవారైతే 8 ఏండ్ల లోపు) పాటు ఈ ఓఎస్‌సీ సెంటర్లలో తాత్కాలిక ఆశ్రయం పొందవచ్చు.

కోరుట్ల మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్

కోరుట్ల రూరల్, మార్చి 6 : జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంతోపాటు ఇంటింటా సర్వే చేసిన సిబ్బందికి వేతనాలు చెల్లింకపోవడం వంటి కారణాలతో ఆయనను సస్పెండ్ చేశారు. కోరుట్ల ఎంపీడీవో ఓదెల రామకృష్ణను ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు.

సిరిసిల్ల కాంగ్రెస్ నేతలకు అధిష్ఠానం ఝలక్!

- కేకేకు ఎమ్మెల్సీ ఇవ్వాలని హైదరాబాద్‌కు పయనం..
- రావద్దంటూ ఆదేశాలు

సిరిసిల్ల రూరల్, మార్చి 6: సిరిసిల్లలో కాంగ్రెస్ నేతలకు అధిష్ఠానం ఝలక్ ఇచ్చింది. కాంగ్రెస్ పెద్దలు, నూతన ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కేకే మహేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరేందుకు గురువారం కాంగ్రెస్ నేతలు ప్రత్యేక వాహనాల్లో హైదరాబాద్ బయలుదేరారు. లాబీయింగ్ కోసం హైదరాబాద్‌కు ఎవరూ రావద్దంటూ అధిష్ఠానం నుంచి సమాచారం రావడంతో నిరాశ చెందారు.

లాంగ్‌వాల్ వద్దు.. పంట పొలాలే ముద్దు

- శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ ప్రజాభిప్రాయ సేకరణ సభలో పెద్ద ఎత్తున రైతుల నినాదాలు
- పచ్చని పొలాల్లో విధ్వంసం సృష్టిస్తారా?
- ఆ ఆలోచన విరమించుకోకుంటే పది వేల మందితో నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరిక
- అడుగడుగునా పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు

లాంగ్‌వాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రైతులు

బెల్లంపల్లి, మార్చి 6 : శాంతిఖని భూగర్భ గనిని లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌గా మార్చడం వద్దే వద్దని.. పంట పొలాలే ముద్దు అని.. ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని, బలవంతంగా మార్చాలని చూస్తే పదివేల మందితో నిరాహార దీక్ష చేపడుతామని ప్రభావిత గ్రామాల రైతులు హెచ్చరించారు. గురువారం మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని శాంతిఖని లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ కోసం పాత శాంతిఖని గని ఆవరణలో భారీ పోలీసుల బందోబస్తు మధ్య ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. మంచిర్యాల అదనపు కలెక్టర్ సభాపతి మోతీలాల్, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ ప్రాంతీయ కార్యాలయ అధికారి విష్ణుప్రసాద్ హాజరైన సమావేశంలో రైతులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్ రైతులకు మద్దుతుగా నాయకత్వం వహించారు. లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌తో భూములు నాశనమవుతాయని, భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టాలతో నడుస్తున్న గనిని లాంగ్‌వాల్ చేయడమేమిటని ప్రశ్నించారు. మందమర్రి జీఎం దేవేందర్ ఓసారి ఓసీ, మరోసారి లాంగ్‌వాల్ ప్రాజెక్టులని.. పూటకో మాట మారుస్తూ రైతులను భయపెడుతున్నారని ఆరోపించారు. 3 నెలల నుంచి ప్రాజెక్ట్ ప్రభావిత గ్రామాల్లో ప్రశాంతత కరువైందని పేర్కొన్నారు. శాంతిఖనిని ఓసీ చేయడానికే చాప కింద నీరులా లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకువస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాజెక్ట్‌తో ఎండిన చెరువులు, బోర్లు, బీడు భూములు దర్శనిమిస్తాయని తెలిపారు. ప్రభావిత గ్రామమైన లింగాపూర్‌లో 400 నుంచి 500 మీటర్లు బోర్ వేస్తేగానీ నీరు రావడం లేదని గుర్తుచేశారు. పంటలు నాశనం అవతాయని చెబుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. బొగ్గుతోపాటు వరి కూడా జాతీయ సంపద అని స్పష్టం చేశారు. బెల్లంపల్లి ఐదు కిలోమీటర్ల పరిధిలో బొగ్గు ఉత్పత్తి చేయకుండా వ్యవసాయ భూములను వదిలి అటవీ భూముల్లో బొగ్గు వెలికితీయాలని సూచించారు. ప్రాణాలు పోయినా లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌ను అనుమతించమని స్పష్టంచేశారు.

కంటతడిపెట్టిన రైతులు

పచ్చని పొలాల్లో విధ్వంసం సృష్టిస్తారా అని ముడిమడుగుల మల్లన్నతో పాటు మరికొంత మంది రైతులు కంట తడి పెట్టారు. శాంతిఖని గని చరిత్రలో ఎప్పుడూ లేని అనుమతులు కొత్తగా ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. పంట తల్లిని నమ్ముకుని ఉన్న తమను నిరాశ్రయులను చేయవద్దని కోరారు. మూడేళ్ల నుంచి శాంతిఖని షాఫ్ట్‌లో రూపాయి లాభం లేకుండా ఎందుకు బొగ్గు ఉత్పత్తి చేస్తున్నారని, భారీ యంత్రాలను తీసుకువచ్చి ఇక్కడ ఉత్పత్తి చేయడమెందుకు అని ప్రశ్నించారు.

ఉద్యమిస్తాం..

శాంతిఖని ఓసీ లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ ప్రకటనతో ప్రభావిత గ్రామాలు ఆకెనపల్లి, లింగాపూర్, పెరకపల్లి, బట్వాన్‌పల్లి, గురిజాల, పాత బెల్లంపల్లిలో మూడు నెలలుగా ప్రశాంతత కరువైంది. లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ చేస్తామని మందమర్రి జీఎం దేవేందర్ ప్రకటించినప్పటి నుంచి ఇక్కడి రైతులు అభద్రతలో ఉన్నారు. లాంగ్‌వాల్‌తో ప్రజల మనుగడ నాశనం అవుతుంది. పోలీసులను ఉపయోగించి, కార్మికులను అడ్డం పెట్టుకుని ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నారు. పచ్చని గ్రామాలను బొందల గడ్డగా మారిస్తే ఉద్యమిస్తాం.

- కారుకూరి రాంచందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్

రైతులను బిచ్చగాళ్లను చేయడానికే..

ప్రభావిత గ్రామాల రైతులను బిచ్చగాళ్లను చేయడానికే ప్రాజెక్ట్ చేపడుతున్నారు. మాదారం గోలేటి ప్రాంతాల్లో ప్రాజెక్ట్ చేపట్టాలి. సింగరేణికే జీవించే హక్కు ఉందా...రైతులకు లేదా.. యాజమాన్యం కళ్లు గప్పి మోసం చేస్తోంది. మరో ఉద్యమం చేసి లాంగ్‌వాల్ ప్రాజెక్ట్‌ను అడ్డుకుంటాం

-చదువుల వెంకటరమణ, రైతు

భూముల రేట్లు తగ్గాయి

లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ ప్రకటనతో ఇక్కడి వ్యవసాయ భూముల రేట్లు తగ్గాయి. ఓసీ, లాంగ్‌వాల్ చేస్తే తిరుగుబాటు తప్పదు. సింగరేణి యాజమాన్యం మూల్యం చెల్లించుకోకతప్పదు. లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ అంటే భూభాగం మొత్తం రంధ్రాలు అయి ముల్లె మూట సర్దుకుని పోవాల్సిందే.

- కారుకూరి వెంకటేశ్, రైతు

వేతనాల బిల్లింగ్‌కు 20 వేల లంచం

- ఏసీబీ అధికారులకు చిక్కిన ధర్మపురి మున్సిపల్ కమిషనర్
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

ధర్మపురి, మార్చి 6 : జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కందుకూరు శ్రీనివాస్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి జీతం బిల్ చేయడానికి రూ.20 వేలు లంచం డిమాండ్ చేసి ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, బాధితుడు పైడిపల్లి మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెల్గొండకు చెందిన మహేశ్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్‌గా ఆర్సీఎస్ (రీజినల్ సెంటర్ ఆఫ్ అర్బన్ ఎన్విరాన్మెంటల్ సర్వీస్) అనే ఏజెన్సీ సంస్థ ద్వారా 2020 డిసెంబర్ 14న నియామకమయ్యాడు. గతంలో మహేశ్‌కు నెలకు రూ.20 వేల జీతం వస్తుండగా.. 2024 ఏప్రిల్ నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్, వన మహోత్సవం పనుల బాధ్యతలు అప్పగించడంతో నెలకు రూ.35 వేలు చెల్లించేలా సీడీఎంఏ డైరెక్టర్ నుంచి అప్రూవల్ వచ్చింది. ధర్మపురిలో గత కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్న సమయంలో క్రమంగా రూ.35 వేల జీతం వచ్చేది. ప్రస్తుత కమిషనర్ కందుకూరు శ్రీనివాస్ వచ్చిన నాటి నుంచి 6 నెలలుగా జీతం రావడంలేదు. డబ్బుల కోసం అడిగితే 'నేను ఇచ్చినప్పుడే జీతం.. నువ్వు అడిగితే రాదు. ఎక్కడైనా చెప్పుకో' అంటూ బెదిరించాడు. అదే సమయంలో రూ.30 వేల లంచం డిమాండ్ చేశాడు. 6 నెలల జీతం రావాల్సి ఉండగా రూ.30 వేలు లంచం ఇవ్వడానికి ఒప్పుకొని మొదట రూ.10 వేలు ఇచ్చాడు. మరో రూ.20 వేలు ఇచ్చే సమయంలో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. పథకం ప్రకారం మహేశ్ కమిషనర్ శ్రీనివాస్‌కు 20 వేలు ఇస్తుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఏసీబీకి చిక్కిన చౌటుప్పల్ ఏడీ

చౌటుప్పల్, మార్చి 6 : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల విద్యుత్తు శాఖ ఏడీ గాజుల శ్యామ్‌ప్రసాద్ ఏసీబీ అధికారులకు గురువారం పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. తంగడపల్లిలోని అక్రిట్ పరిశ్రమలో సోలార్ విద్యుత్తు ప్లాంట్‌ను ఓ కాంట్రాక్టర్ ఏర్పాటు చేస్తున్నాడు. సోలార్, సాధారణ విద్యుత్తును కనెక్ట్ చేసిన తర్వాత మీటర్ ఇవ్వడం కోసం ఏడీ శ్యామ్‌ప్రసాద్ రూ.70వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించాడు. చౌటుప్పల్‌లోని విద్యుత్తు కార్యాలయంలో కాంట్రాక్టర్ నుంచి ఏడీ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని ఏడీ ఇంట్లో సైతం సోదాలు నిర్వహించారు.

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం వంతడపలలో అధికారులను నిలదీస్తున్న సోమక్క, ఎల్లయ్య దంపతులు

లంచాలు ఇచ్చినోళ్లకే ఇందిరమ్మ ఇల్లు ఇస్తరా?

నర్సింహులపేట, మార్చి 6 : లంచాలు ఇచ్చినోళ్లకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తారా.. ఇండ్లులేనివారికి ఇవ్వరా అంటూ ఓ దంపతులు అధికారులను నిలదీశారు. మహబూబాబాద్ జిల్లా వంతడపల ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపికవడంతో గురువారం మండల ప్రత్యేకాధికారి ప్రేమ్ కుమార్ అధ్యక్షతన అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. గ్రామంలో ఎంపికైన 91 మంది లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించారు. మేర్గు సోమక్క- ఎల్లయ్య దంపతుల పేర్లు రాలేదు. దీంతో వారు 'తమ ఇల్లు వానకు కూలింది. కిరాయికి ఉంటున్నం.. మా పేరు ఎందుకు రాలేదు' అని గొడవకు దిగారు. లంచాలు ఇచ్చిన వారి పేర్లు లిస్టులో రాస్తున్నారు అని ఆరోపించారు. దరఖాస్తు చేసుకుంటే విచారిస్తామని ఎంపీడీవో హామీ ఇచ్చారని చెప్పారు.

మహబూబాబాద్ మార్కెట్ ఎదుట ఆందోళన చేస్తున్న మిర్చి రైతులు

మానుకోటలో మిర్చి రైతుల ఆందోళన

- పంటను మార్కెట్‌లోకి అనుమతించాలని డిమాండ్
- రోడ్డుపై నిరసన వ్యక్తంచేసిన రైతులు

మహబూబాబాద్ రూరల్, మార్చి 6 : వ్యవసాయ మార్కెట్‌లోకి మిర్చి బస్తాలను అనుమతించాలని రైతులు ఆందోళనకు దిగారు. బయ్యారం, డోర్నకల్ సుదూర మండలాల నుంచి వచ్చిన రైతులు గురువారం రాత్రి మహబూబాబాద్ మార్కెట్ ఎదుట నిరసన తెలిపారు. మార్కెట్‌లోకి మిర్చి బస్తాలు తీసుకురావడానికి మూడు రోజులుగా ఇబ్బందిపడుతున్నామని, ఇప్పుడు మళ్లీ ట్రాక్టర్‌లో బస్తాలను తెస్తే అధికారులు వాహనాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అసలే మార్కెట్‌లో కాంటాలు కాక రైతులు ఇబ్బంది పడుతుంటే మార్కెట్‌కు మాత్రం వరుసగా రైతులకు ఎలాంటి సమాచారం లేకుండా సెలవులు ప్రకటించి గేట్లకు తాళాలు వేసి ఇబ్బందిపెడుతున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనపై మార్కెట్ కార్యదర్శి షంశీర్‌ను వివరణ కోరగా.. రెండు రోజులుగా జిల్లాలోని అన్ని మండలాల నుంచి మిర్చి ఎక్కువ సంఖ్యలో వచ్చిందని, మార్కెట్‌లో షెడ్లు మొత్తం నిండిపోయినట్టు తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు సెలవు ఇవ్వడం వల్ల వాహనాలను లోనికి రానివ్వడం లేదని పేర్కొన్నారు.